క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పులివెందుల రూరల్ : పట్టణంలో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పుల్లారెడ్డి ఆసుపత్రి, చిన్నన్న రూములు, ఎస్సీ కాలనీ, చెన్నారెడ్డి కాలనీ, తదితర ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడుతున్నట్లు విద్యుత్‌శాఖ జేఈ రమేష్ తెలిపారు. పుల్లారెడ్డి ఆసుపత్రి వద్ద కొత్త ట్రాన్స్‌ఫార్మర్ పనులు ఉన్నందువల్ల 11 కె.వి. ఫీడర్ ఎల్‌సీ తీసుకోవడంతో విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు.

అక్రమ లేఅవుట్ల తొలగింపు



అక్రమ లేఅవుట్లలో రాళ్లను తొలగిస్తున్న మున్సిపల్ అధికారులు

ఎర్రగుంట్ల : మున్సిపల్ పరిధిలో అనుమతులు తీసుకోకుండా రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులు వేసిన అక్రమ లేఅవుట్లను అధికారులు తొలగించే ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఈ అక్రమ లేఅవుట్లపై ఫిర్యాదుల రావడంతో మున్సిపల్ కమిషనర్ రామకృష్ణయ్య ఆదేశాల మేరకు మున్సిపల్ టౌన్ ప్లానర్లు శనివారం అక్రమ లేఅవుట్లపై విచారణ చేసి తొలగిస్తున్నారు.

వెలిదండ్ల దేవరకోనలో చతుర్మాస దీక్షలు



దీక్షల్లో పాల్గొన్న భక్తులు, భాగవత పండితులు

లింగాల : మండలంలోని వెలిదండ్ల గ్రామ సమీపంలోని దేవరకోన వరదరాజులస్వామి ఆలయంలో చతుర్మాస దీక్షలు నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. నవంబర్ 15వ తేదీ వరకు ఈ దీక్షలు కొనసాగుతాయన్నారు. భారతం, మహాభాగవతం, పురాణ గాథలు చదివి వినిపిస్తారన్నారు. కార్యక్రమంలో లింగాల, పులివెందుల, సింహాద్రిపురం, అనంతపురం జిల్లా, తదితర ప్రాంతాలకు చెందిన భాగవత పండితులు పాల్గొంటారన్నారు.

రైల్వేస్టేషన్‌లో మౌలిక వసతులు కల్పించాలి

జమ్మలమడుగు రూరల్ : స్థానిక రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులకు మౌలిక వసతులు కల్పించాలని జమ్మలమడుగు రైల్వేస్టేషన్ కమిటీ మెంబర్లు సి.వెంకటేశ్వర్లు, పామిలేటిలు శనివారం రైల్వేస్టేషన్ మేనేజర్ సీతారామయ్యకు వినతిపత్రం అందించారు. నంద్యాల నుంచి జమ్మలమడుగు మీదుగా బెంగుళూర్‌కు ఒక ఇంటర్‌సిటీ ప్యాసింజర్, హైదరాబాద్ టు జమ్మలమడుగు మీదుగా చెన్నైకు ప్యాసింజర్ అలాగే నంద్యాల టు రేణిగుంట్లకు డెమో రైలు ఉంది. మరొక్కటి డెమో రైలు ఏర్పాటు చేయాలన్నారు. స్టేషన్‌లో మహిళా ప్రయాణికుల కోసం ఒక మహిళ సెక్యూరిటీ గార్డ్‌ను అధికారులు ఏర్పాటుచేయాలన్నారు.

ఘనంగా భవాని పీరు ఉత్సవం



గ్రామోత్సవంలో భవాణీ పీరు ఉత్సవం

పులివెందుల టౌన్ : పట్టణంలో భవాణీ పీరు ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. స్థానిక బీఎస్ఎన్ఎల్ కార్యాలయ సమీపంలోని పీర్ల చావిడిలో అగ్నిగుండ ప్రవేశం చేసి గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు చెక్కర చదివింపులు ఇచ్చారు. భక్తులు వెండిగొడుగులు చేయించి తమ మొక్కులు తీర్చుకున్నారు. మెయిన్ బజార్, శ్రీరామాహాల్ రోడ్డు, మారుతిహాల్ రోడ్, తదితర ప్రాంతాల్లో పీర్ల ఉత్సవం జరిగింది.

కొండాపురంలో..

కొండాపురం : మండలంలోని కె.సుగుమంచిపల్లె గ్రామంలో శనివారం తెల్లవారుజామున పీర్లను ఘనంగా ఊరేగించారు. ఆదివారం గుండంలోకి ప్రవేశిస్తాయన్నారు. అనంతరం పీర్లు ఏటికి పోతాయని భక్తులు తెలిపారు.

నేడు గురుపౌర్ణమి వేడుకలు

వీరపునాయునిపల్లె : మండలంలోని ఎస్.పాలగిరి క్రాస్ రోడ్డు వద్ద ఉన్న సాయిబాబా ఆలయం, సంగాలపల్లె గ్రామంలో ఉన్న శ్రీశివకృష్ణ గోశాలలో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

పెద్దముడియంలో..

పెద్దముడియం: మండలంలో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలను పెద్ద ఎత్తున నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.మండలంలోని సాయిబాబా దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. పెద్దపసుపుల గ్రామంలో మధ్యాహ్నం భక్తాదులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

సమస్యల వలయంలో చిలంకూరు వసతి గృహం

- అధికారుల ఉత్తర్వులు లేకుండానే వసతి గృహాన్ని మూసి వేసిన వార్డన్
- రెండు నెలల నుంచి చిలంకూరులో తెరుచుకోని వసతి గృహం
- వసతి గృహాన్ని కొనసాగించాలంటున్న విద్యార్థుల తల్లిదండ్రులు



వసతి గృహంను తెరిపించాలని కోరుతున్న విద్యార్థులు, సంఘీబావం తెలుపుతున్న ఎంపీటీసీ సభ్యులు



హాస్టల్‌లో తుప్పపడుతున్న విద్యార్థుల ట్రంక్కు పెట్టెలు



వసతి గృహంను తెరిపించాలంటున్న విద్యార్థుల తల్లులు

చిలంకూరు గ్రామంలోని ప్రభుత్వ బీసీ సంక్షేమ బాలుర వసతి గృహం సమస్యల వలయంలో చిక్కుంది. ఇక్కడ విద్యార్థులు సంఖ్య పెరుగుతున్నా.. వారికి సరిపడ సౌకర్యాలు కల్పించడంలో అధికారులు విఫలమయ్యారు. పాఠశాలలు ప్రారంభమై రెండు నెలలు కావస్తున్న ఇంత వరకు వసతి గృహం తెరుచుకోలేదు.. అధికారుల ఉత్తర్వులు లేకుండానే వార్డన్ హాస్టల్‌ను మూసి వేశారని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. ఈ హాస్టల్‌ను తిరిగి తెరిపించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని చిలంకూరు గ్రామంలో గతంలో మూడు సంక్షేమ వసతి గృహాలు ఉండేవి. వాటిలో ఎస్సీ బాలిక, బాలుర హాస్టళ్లు, బీసీ బాలుర హాస్టళ్లు ఉండేవి. వీటిలో విద్యార్థులు కూడా చాలా మంది చదువుకునేవారు. కాలక్రమేణ సంక్షేమ వసతి గృహాలు కుదించుకుపోయాయి. ప్రస్తుతం బీసీ సంక్షేమ వసతి గృహం మాత్రమే ఉంది. ఈ వసతి గృహంలో సుమారు 50 మందికి పైగానే వివిధ ప్రాంతాలకు చెందిన పేద విద్యార్థులు ఉన్నారు. అయితే ఏడాది ఈ వసతి గృహాన్ని మూసే పనిలో ఉన్నట్లు సమాచారం. గతేడాది ఇక్కడ పనిచేసిన వార్డెన్ అయ్యవార్‌రెడ్డి పదవీ విరమణ పొందారు. తర్వాత అధికారులు ఇన్‌చార్జి వార్డెన్ వెంకటసుబ్బయ్యను నియమించారు. ఇప్పటి వరకు వసతి గృహంను తిరిగి ప్రారంభించలేదు. అసలు ఈ వసతి గృహం ఉన్నట్ల లేనట్లా అని గ్రామ ప్రజలు విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. సిబ్బంది మాత్రం జీతాలు తీసుకుంటున్నారన్నారు.

వసతి గృహాన్ని వెంటనే తెరవాలి..



ఈ వసతి గృహంలో పేద విద్యార్థులు చాలా మంది ఉన్నారు. గతంలో ఈ వసతి గృహంలో వందకు పైగానే విద్యార్థులు ఉండేవారు. ఇప్పుడు అధికారుల నిర్లక్ష్యం వల్ల ప్రస్తుతం 50 మంది ఉన్నారు. ఇంత వరకు ఈ హాస్టల్‌ను వార్డెన్ ఎందుకు ప్రారంభంచలేదో. ఇప్పటికై న జిల్లా కలెక్టర్ స్పందించి హాస్టల్‌ను తెరిపించాలి.

– కొండయ్య, నవీన్‌కుమార్‌లు (చిలంకూరు ఎంపీటీసీ సభ్యులు)

నాల్గవ తరగతి నుంచి ఇక్కడే చదువుతున్నా..



నాపేరు జగన్‌మోహన్ నేను నాల్గవ తరగతి నుంచి ఇదే వసతి గృహంలో చదువుతున్నాను. ఈఏడాది నేను పదవతరగతి చదువుతున్నాను. మాది పేద కుటుంబం. ఈ వసతి గృహం వల్ల నాలాంటి చాలా మంది పేద విద్యార్థులకు ఎంతో ఉపయోగకరం. ఇప్పటి వరకు వసతి గృహం తెరుచుకోలేదు. రోజు వసతి గృహంకు వచ్చి పోతున్నా.

– జగన్‌మోహన్, హాస్టల్ విద్యార్థి, చిలంకూరు గ్రామం.


హాస్టల్‌ను యథావిధిగా తెరిపించాలి..



నాపేరు రమణ. చిలంకూరులోని బీసీ వసతి గృహంను యథావిధిగా తెరిపించాలి. నేను ఇదే వసతి గృహంలోనే మూడవ తరగతి నుంచి చదువుతున్నాను. ప్రస్తుతం పదవ తరగతి చదువుతున్నాను. ఈ ఏడాది హాస్టల్ ఉందా లేదా అనే సందిగ్ధంలో మేం ఉన్నాం. ఇప్పటికైన ఉన్నతాధికారులు స్పందించి వసతి గృహంను తెరిపించాలి.

– రమణ, హాస్టల్ విద్యార్థి, చిలంకూరు గ్రామం.

పదవీ విరణ పొందిన వార్డెనే మూసివేశారు..



చిలంకూరు వసతి గృహంను పదవీ విరమణ పొందిన వార్డెన్ అయ్యవార్‌రెడ్డి మూసి వేశారు. దీనిపై అధికారులు కూడా సమాచారం ఇచ్చామన్నారు. విద్యార్థులు రాత్రిళ్ల సమయంలో ఉండరని అందుకు మూసి వేసినట్లు తెలిపారు. దీనిపై ప్రభుత్వం నుంచి ఏలాంటి అదేశాలు లేవు.

– వెంకటసుబ్బయ్య, ఇన్‌చార్జి వార్డెన్, చిలంకూరు హాస్టల్.

ఆధార్ అప్డేట్ చేయించుకోవాలి

పులివెందుల టౌన్ : భారతదేశంలో ఆధార్ ఒక విశిష్ట గుర్తింపు కార్డుగా ఉన్నందున ఆధార్‌కార్డుతో ప్రజలు అనేక రకాల ప్రభుత్వ పథకాలు పొందేందుకు ఆధార్ అప్డేట్ చేయించుకోవాలని మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీలో ఉన్న ప్రజలు ఇంకా కొంత మంది బయోమెట్రిక్, డాక్యుమెంట్ అప్డేషన్ పెండింగ్‌లో ఉన్నందున వారి కోసం ప్రభుత్వం ఆధార్ స్పెషల్ క్యాంపు ఏర్పాటు చేసిందన్నారు. ఈ నెల 23వ తేదీ నుంచి 27వ తేదీ వరకు ఆయా సచివాలయాల్లో నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇందుకు సంబంధించి 23వ తేదీన చెన్నారెడ్డికాలనీ, నగరిగుట్ట సచివాలయం, 24న ప్రశాంతి నగర్, వెంకటాపురం సచివాలయం, 25న మిస్సమ్మబంగ్లా, పెద్దకొండప్పకాలనీ సచివాలయం, 26న భాకరాపురం, ఉలిమెల్ల సచివాలయం, 27న రాజీవ్ కాలనీ సచివాలయాల్లో ఆధార్ కేంద్రాలను నిర్వహిస్తారన్నారు.ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆధార్ అప్డేట్ చేసుకోవాలని ఆయన తెలిపారు.

వరిసాగుపై ప్రత్యేక పద్ధతులు పాటించండి

కొండాపురం : వరిసాగుపై రైతులు ప్రత్యేక పద్ధతులను పాటించాలని వ్యవసాయ సహాయ సంచాలకులు వెంకటసుబ్బయ్య తెలిపారు. శనివారం ఆర్‌బీకేలో గ్రామ వ్యవసాయ సహాయకులకు, రైతులకు అవగాహన కల్పించారు. ఏటూరు గ్రామంలో రైతులతో మాట్లాడుతూ వరిపొలంలో తూర్పు–పడమర దిశగా ప్రతి రెండు మీటర్లకు 20 సెం.మీ గ్యాప్‌లో కాలి బాటలు తీసుకుకోవాలన్నారు. ఏఓ రామంజులరెడ్డి మాట్లాడుతూ కౌలు రైతులు రైతు బరోసా కేంద్రంలో వీఆర్వోను సంప్రదించాలన్నారు.

వివరాలను రికార్డులలో పొందుపరచాలి



మాట్లాడుతున్న వ్యవసాయ సంచాలకులు నరసింహారెడ్డి

పులివెందుల రూరల్ : పులివెందుల డివిజన్ పరిధిలోని ఎరువుల దుకాణాల్లో మందుల వివరాలను రికార్డుల్లో పొందుపరచాలని డివిజన్ వ్యవసాయ సంచాలకులు నరసింహారెడ్డి తెలిపారు. శనివారం పులివెందులలోని వ్యవసాయ కార్యాలయంలో డీలర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డీలర్లు ఖచ్చితంగా స్టాక్ రిజిష్టర్, ఫామ్ ఓ, పీసీలు పరీక్షించుకోవాలన్నారు. మందులు కొనుగోలు చేసేటప్పుడు జీ3 సర్టిఫికెట్ తప్పనిసరిగా తమ వద్ద ఉంచుకోవాలన్నారు. దుకాణాల వద్ద స్టాక్ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. దుకాణాల్లో ఉన్న మందుల వివరాలను స్టాక్ బోర్డు నందు పొందుపరచాలన్నారు. ఫామ్ ఓలు, పీసీలు లేకుండా మందుల దుకాణాల్లో కొనుగోలు, అమ్మకాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతీరోజు స్టాక్ రిజిష్టర్‌ను అప్‌డేట్ చేయాలన్నారు. కార్యక్రమంలో పులివెందుల డివిజన్ టెక్నికల్ అసిస్టెంట్ సునీల్‌కుమార్‌రెడ్డి, వేముల, పులివెందుల వ్యవసాయ అధికారులు చెన్నారెడ్డి, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేడు గురుపౌర్ణమి మహోత్సవం

కమలాపురం : పట్టణ పరిధిలోని కె.అప్పాయపల్లెలో వెలసిన అనాథ బాలుర ఛాత్రాలయంలో యోగా గురువు శ్రీ అనపాటి నాగరాజు శిష్యుల ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం 6 గంటలకు గురుపౌర్ణమి మహోత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బి.మఠం అచల పీఠాధిపతి శ్రీ విరజానందా గురుజీ ముఖ్య అతిథిగా విచ్చేస్తున్నారని, ప్రతి ఒక్కరూ హాజరై కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఎస్‌ఎస్‌వై యోగా శిష్య బృందం తెలిపారు.

జమ్మలమడుగులో

జమ్మలమడుగు : పట్టణంలోని ముద్దనూరు రహదారిలో ఉన్న జ్ఞాన సాయిబాబా ఆలయాన్ని ముస్తాబుచేశారు. ఆదివారం గురుపౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజ కార్యక్రమాలు చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తులకు అన్నదానం నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త తాతిరెడ్డి సూర్యనారాయణరెడ్డి తెలిపారు.

ముందస్తు వేడుకలు ..



చిన్నారులతో కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి

వేంపల్లె : స్థానిక శ్రీచైతన్య హైస్కూల్‌లో ముందస్తు గురుపౌర్ణమి వేడుకలను నిర్వహించినట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి తెలిపారు. గురుపౌర్ణమి వంటి పవిత్రమైన రోజున గురువులకు ప్రత్యేక పూజలు చేస్తారని తెలిపారు. ఇలాచేయడం వల్ల విజయం సాధిస్తామని, ఉన్నత స్థానాలకు చేరుకుంటామన్నారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్స్ చేతన్‌రెడ్డి, చైతన్యరెడ్డి, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గండి ఉత్సవాలకు సహకారమివ్వండి

చక్రాయపేట : అన్ని శాఖలకు చెందిన అధికారులు సహకారమిస్తే గండిలో శ్రావణ మాస ఉత్సవాలు ప్రణాళికా బద్ధంగా ప్రశాంతంగా నిర్వహిస్తామని ఆలయ సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య తెలిపారు. శనివారం గండిక్షేత్రంలోని ఆలయ కార్యాలయంలో ఉత్సవాల నిర్వహణపై అన్ని ప్రభుత్వ శాఖల అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. గండిలో రాజగోపురం నిర్మాణం సందర్భంగా రోడ్డుపై గుంతను తవ్వినందున వాహనాలు ఒకవైపునే వెళుతున్నాయని దీంతో ఉత్సవాల సందర్భంగా ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమయ్యే అవకాశం ఉందని ఆర్కే వ్యాలీ ఎస్‌ఐ రంగారావు తెలిపారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని శ్రావణ మాసంలో వచ్చే ప్రతి శనివారం వాహణాలను అద్దాలమర్రి క్రాస్, ఇడుపులపాయ క్రాస్ వద్దనే ఆపేస్తామన్నారు. గతంలో చివరి రెండు వారాలు మాత్రమే ట్రాఫిక్ ఆంక్షలు ఉండేవని ఈసారి అన్ని వారాలు ఆంక్షలు ఉంటాయన్నారు. ఉత్సవాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. చక్రాయపేట ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ తరపున ఉత్సవాల గోడపత్రికలను ఉచితంగా అచ్చు వేయించి ఇస్తామని బ్యాంక్ మేనేజర్ భానుచందర్ తెలిపారు. అలాగే ఉత్సవాల్లో టికెట్ కౌంటర్లు, లడ్డు, పులిహోర ప్రసాదాల విక్రయ కౌంటర్లను కూడా తమ బ్యాంకు ఆధ్వర్యంలోనే నిర్వహిస్తామన్నారు. ఉత్సవాల సమయంలో వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి 24 గంటలు భక్తులకు వైద్యసేవలు అందేలా చూస్తామని చక్రాయపేట వైద్యాధికారిణి వాణి తెలిపారు. అలాగే విద్యుత్, నీటిసమస్య, బారికేడ్లు, క్యూలైన్లు, దుకాణాల నిర్వహణ, అలంకరణ, రవాణా సౌకర్యాలు, అగ్నిమాపక శాఖ తదితరాలపై చర్చించారు. అనంతరం ఆలయ అధికారి వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ అందరూ సహకరించి ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన, ఉపప్రధాన, ముఖ్య అర్చకులు కేసరి, రాజారమేష్, రాజగోపాలాచార్యులు, డిప్యూటీ తహసీల్దారు కృష్ణారెడ్డి, ఎంపీడీవో సోమశేఖర్, ట్రాన్స్‌కో, ఆర్టీసీ, ఆర్‌డబ్ల్యూఎస్, పోలీసు, పంచాయతీరాజ్, అగ్నిమాపకశాఖ అధికారులు పాల్గొన్నారు.

వాహనదారులు లైసెన్స్ కలిగి ఉండాలి



వాహనాలను తనిఖీ చేస్తున్న రూరల్ సీఐ మద్దిలేటి



వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ అనిల్‌కుమార్

పులివెందుల రూరల్ : వాహనదారులు ప్రతి ఒక్కరు లైసెన్స్‌లు కలిగి ఉండాలని రూరల్ సీఐ మద్దిలేటి తెలిపారు. శనివారం ముద్దనూరు రింగు రోడ్డు సమీపంలో ఆయన వాహనాలను తనిఖీ చేసి మాట్లాడారు. ద్విచక్ర వాహనదారులు దూర ప్రాంతాలకు వెళ్లేటప్పుడు తప్పనిసరిగా వాహనాలకు సంబంధించిన రికార్డులను తమ వద్ద ఉంచుకోవాలన్నారు. అలాగే హెల్మెట్‌ను ధరించి ప్రయాణం సాగించాలన్నారు. అలాగే ఆటోలు, ట్రాక్టర్లు, ప్రైవేట్ వాహనాలు అధిక లోడ్‌తో ప్రయాణికులను ఎక్కించుకుంటే వాహనాలను సీజ్ చేయడంతో పాటు కేసులు నమోదు చేస్తామన్నారు. ప్రమాదాలు అరికట్టేందుకు ప్రతి ఒక్కరు ప్రభుత్వ నిబంధనలను పాటించాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సింహాద్రిపురంలో..

సింహాద్రిపురం : ప్రతి వాహనదారుడు లైసెన్స్ తప్పనిసరిగా కలిగి ఉండాలని ఎస్‌ఐ అనిల్‌కుమార్ తెలిపారు. శనివారం ఆయన ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు హిమకుంట్ల క్రాస్ వద్ద వాహనాలను తనిఖీలు చేసి మాట్లాడారు. వాహనం నడిపే వ్యక్తి లైసెన్స్ కలిగి ఉండటంతో పాటు వాహనానికి సంబంధించిన అన్ని పత్రాలను కలిగి ఉండాలని, లైసెన్స్ లేని వారికి జరిమానాలు తప్పవన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వడం చట్టరీత్యా నేరమన్నారు.

గండి ఆలయానికి టీవీ బహూకరణ



ఆలయ అధికారికి టీవీని అందజేస్తున్న దాతలు గంగాదర్, సునీల్‌లు

చక్రాయపేట : గండి వీరాంజనేయస్వామి ఆలయానికి శనివారం వేంపల్లెకు చెందిన బీజీఎస్ ఎలక్ట్రానిక్స్ వారు రూ.40 వేల విలువగల 55 ఇంచుల టీవీని బహూకరించారని ఆలయ సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య తెలిపారు. కీ.శేషులు బైరిశెట్టి వెంకటజయకుమార్, బైరిశెట్టి జ్యోతికుమారిల జ్ఞాపకార్థంగా వారి కుమారులు బాలగంగాధర్, వెంకటసునీల్‌కుమార్‌లు టీవీని అందజేసినట్లు తెలిపారు. వారికి ప్రత్యేక పూజలు చేయించి తీర్థ ప్రసాదాలను అందజేశామన్నారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన, ఉపప్రధాన, ముఖ్య అర్చకులు కేసరి, రాజారమేష్, రాజగోపాలాచార్యులు, ఆలయ సూపరింటెండెంట్ షరీఫ్, ఇన్‌స్పెక్టర్ రవిచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి



బీసీ రెసిడెన్షియల్‌లో మాట్లాడుతున్న షేక్ ఇమ్రాన్

కమలాపురం : ప్రతి ఒక్కరూ విద్యార్థి దశ నుంచే అంది వచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థానాలను అధిరోహించాలని జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారి షేక్‌ఇమ్రాన్ తెలిపారు. శనివారం కమిషనర్, యువజన సర్వీసుల శాఖ ఆదేశాల మేరకు, స్టెప్ సీఈఓ సాయిగ్రేస్ పర్యవేక్షణలో స్థానిక ఎం.జే.పీ. బీసీ రెసిడెన్షియల్ స్కూల్, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో వ్యక్తిత్వ వికాసం, కెరీర్ కౌన్సిలింగ్ పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పోటీ తరుణంలో రాణించాలంటే లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు కృషి చేయాలన్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీతో పాటు సాంకేతిక నైపుణ్య కోర్సులను ఎంచుకుని వాటి సాధనకు కృషి చేయాలన్నారు. సివిల్స్ సాధించాలి అనుకుంటే సరిపోదని, దానిని సాధించడానికి ప్రణాళికా బద్ధంగా కృషి చేయాలన్నారు. వాటి సాధనలో మీకు ముందు తరగతుల్లో బోధించిన ఉపాధ్యాయులు, అధ్యాపకులతో పాటు ఇప్పటికే ఉన్నత స్థానాలను అధిరోహించిన వారి సలహాలు, సూచనలు తీసుకుని వాటిని పాటించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బి.వెంకటేశ్వర్లు, హెచ్‌ఎం నాగిరెడ్డి, స్టెప్ మేనేజర్ సుబ్బరాయుడు సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న కమిషనర్ రమణారెడ్డి

పులివెందుల టౌన్ : విషజ్వరాల భారిన పడకుండా దోమలను నివారించడంలో ప్రతి ఒక్కరు ముందుండాలని మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి తెలిపారు. స్టాప్ డయేరియా కార్యక్రమంలో భాగంగా దోమల నివారణ, పరిశుభ్రత కార్యక్రమంపై సె యింటాన్స్ స్కూల్‌లో శనివారం ఆయన విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడమే కాకుండా ఇంటి బయట కొబ్బరిచిప్పలు, టైర్లు, మురుగునీరు నిల్వ ఉన్న ప్రాంతాలలో నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. లార్వా వృద్ధిచెందే ఈ ప్రాంతాలను పరిశుభ్రం చేసుకుంటే దోమలను నివారించుకోవచ్చన్నారు. కలుషిత నీరు, ఆహారం వల్ల టైఫాయిడ్, డైయేరియా వంటి వ్యాధులు వస్తాయన్నారు. అందుకోసం విద్యార్థులు పరిశుభ్రత పాటించే విధంగా తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. వాటిని తూచా తప్పకుండా పాటించాలన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళీధర్, సెక్రటరీలు పాల్గొన్నారు.

ఎర్రగుంట్లలో..

ఎర్రగుంట్ల : వ్యాధులు ప్రబలకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి లక్ష్మయ్య తెలిపారు. శనివారం పట్టణంలోని రాణివనంలో ఉన్న ప్రభుత్వ బాలికల వసతి గృహంలో దోమల నివారణకు మందును పిచికారీ చేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్ ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

కమలాపురంలో..

కమలాపురం : దోమలను నివారించడానికి ప్రతి ఒక్కరూ తమ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని నగర పంచాయతీ కమిషనర్ రాముడు తెలిపారు. శనివారం పట్టణంలోని మురికి కాలువలు, మురికినీరు ప్రవహిస్తున్న ప్రాంతాల్లో దోమల నివారణ మందును పిచికారి చేయించారు. దోమల నివారణ కోసం ప్రత్యేక డ్రైవ్ చేపట్టామన్నారు. ఇప్పటికే ప్రతి రోజు రాత్రి సమయాల్లో ఫాగింగ్ చేస్తున్నామని, అలాగే డ్రైన్స్, మురికి నీరు ప్రవహించే ప్రాంతాల్లో దోమల నివారణ మందు పిచికారి చేస్తున్నామన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు.

వేంపల్లెలో..

వేంపల్లె : డయేరియా నివారణకు జాగ్రత్తలు పాటించాలని తాళ్లపల్లి ప్రాథమికి ఆరోగ్యకేంద్రం వైద్యులు స్వాతిసాయి తెలిపారు. శనివారం 8వ సచివాలయం పరిధిలోని రాజీవ్‌నగర్ కాలనీలో ఉన్న మదర్‌థెరిస్సా అనాథ వృద్ధాశ్రమం, ఇడుపులపాయ గ్రామ సచివాలయ పరిధిలోని మదర్ థెరిస్సా చారిటబుల్ ట్రస్ట్ వృద్ధాశ్రమంను ఆమె సందర్శించి వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఆశ్రమంలో ఉన్న వృద్ధులందరికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఆశ్రమంలో ఉన్న వృద్ధులు దోమతెరలు ఖచ్చితంగా వాడాలన్నారు. కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

అత్యాచారాలు చేసేవారిని శిక్షించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థినులు, డీవైఎఫ్‌ఐ నాయకులు

జమ్మలమడుగు : మహిళలు, బాలికలపై అత్యాచారాలు చేసేవారిని కఠినంగా శిక్షించాలని డీవైఎఫ్‌ఐ, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని బాలికల జూనియర్ కాలేజి విద్యార్థులతో కలిసి వారు నిరసన వ్యక్తం చేసి మాట్లాడారు. ముచ్చుమర్రి ప్రవంతి అనే చిన్నారిపై అత్యాచారం చేసి చంపినందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో మహిళలపై, బాలికలపై అత్యాచారాలు పెరిగిపోతున్నాయన్నారు. ప్రభుత్వం కాలేజి, పాఠశాలల్లో విద్యార్థుల్లో ఆత్మస్థైరాన్ని నింపడంకోసం వారికి కరాటే, టైక్వాండో క్లాసులను ఏర్పాటు చేయాలని సూచించారు. ఆత్యాచారాలు చేసిన వారికి రాజకీయ నాయకుల అండ ఉండటంతో ప్రభుత్వాలు తమని ఏమీచేయలేవనే భావనలో ఉన్నారన్నారు. ఆత్యాచారం చేసినట్లు రుజువు అయితే వారిని ఎన్‌కౌంటర్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

యువతకు సాధికారత అందించటమే లక్ష్యం



శిక్షణ పూర్తిచేసుకున్న వారికి ప్లేస్‌మెంట్ పత్రాలు ఇస్తున్న దాల్మియా హెడ్ ముఖేష్ కుమార్ సిన్హా

జమ్మలమడుగు రూరల్ : సమగ్ర విద్య, వృత్తి శిక్షణ ద్వారా యువతకు సాధికారత అందించటమే లక్ష్యమని దాల్మియా సిమెంట్ యూనిట్ హెడ్ ముఖేష్ కుమార్ సిన్హా తెలిపారు. శనివారం మండలంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిరుద్యోగ యువతకు వృత్తి నైపుణ్యతపై శిక్షణ కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ సురేంద్రనాథ్‌రెడ్డి అధ్యక్షతన ఆయన ప్రారంభించి మాట్లాడారు. కంప్యూటర్ పరిజ్ఞానంపై నిరుద్యోగ యువతి, యువకులకు 3 నెలల పాటు శిక్షణ ఇచ్చి వారికి సర్టిఫికేట్లను అందజేస్తామన్నారు. వారికి ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. నిరుద్యోగులు ఈ అవకాశన్ని సద్వినియోం చేసుకోవాలన్నారు. ముందు బ్యాచ్‌లో శిక్షణ పొందిన దాదాపు 30 మంది విద్యార్థులకు ఉద్యోగాల్లో ప్లేస్‌మెంట్ కల్పించారు. కార్యక్రమంలో కరూర్ వైశ్యాబ్యాంక్ మేనేజర్ సునీల్‌కుమార్, దాల్మియా హెచ్‌ఆర్ హెడ్ ఉమేష్ కోల్హట్కర్, హెచ్‌ఆర్ విజయరామరాజు తదితరులు పాల్గొన్నారు.